క్లుప్తంగా

జగనన్న గోరుముద్ద పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ అర్జునరావు

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాల్లో ప్రభుత్వ అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని (జగనన్న గోరుముద్ద) చిత్తశుద్ధితో అమలుచేయాలని ఏఎంసీ చైర్మన్ కె.అర్జునరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎనుగుతల సూర్యం, ఇప్పిలి ధనుంజయరావు అన్నారు. మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు బెవర రామ్మూర్తి, ఉపాధ్యాయులు మధుసూదనరావు, కృష్ణారావులు పాల్గొన్నారు.

118 మందికి వైద్య సేవలు



వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు శ్రీధర్

పాతపట్నం: ఏ.ఎస్.కవిటీ గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ 118 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, రోగులకు సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సంతాపం



మెళియాపుట్టిలో మౌనం పాటిస్తున్న ఉపాధి వేతనదారులు

మెళియాపుట్టి: ఆమదాలవలస మండలం మండాదికి చెందిన ఉపాధి వేతనదారులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి ఆత్మకు శాంతి చేకూరాలని మండలానికి చెందిన వేతనదారులు మౌనం పాటించారు. మండలానికి చెందిన పట్టుపురం,గంగరాజపురం, మెళియాపుట్టి ఉపాధి వేతనదారులు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆర్‌అండ్‌బీ భవనం పనులు ప్రారంభం



ఆర్‌అండ్‌బీ భవనం

మెళియాపుట్టి: గత పదేళ్ల క్రితం నిర్మాణం మొదలుపెట్టి నిధుల కొరతతో అర్ధాంతరంగా ఆగిపోయిన మెళియాపుట్టి మండల కేంద్రంలో ఉన్న ఆర్‌అండ్‌బీ భవనం పనులు మళ్లీ మొదలయ్యాయి. ఉన్నతాధికారుల చొరవతో రూ.7లక్షల నిధులు మంజూరయ్యాయని మెళియాపుట్టి ఏఈ ఎస్.ఎల్.నాయుడు తెలిపారు. మరి కొద్ది రోజుల్లోనే పూర్తి చేస్తామన్నారు.

మరుగుదొడ్లు వినియోగంలోకి తేవాలి



పనిచేయని మరుగుదొడ్లు

సరుబుజ్జిలి: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో మరుగుదొడ్లు పనిచేయక పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ సరఫరాలేక పోవడం వల్ల మోటార్లు ఏర్పాటు చేయక రన్నింగ్ వాటర్ కూడా లేదన్నారు. అత్యవర పరిస్థితుల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలు మరుగుదొడ్లు లేక బహిరంగ ప్రదేశాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ అధికారులు స్పందించి మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నేడు ఆటో వేలం

కొత్తూరు: స్థానిక సెబ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు గతంలో పట్టుబడి సీజ్ చేసిన ఆటోను వేలం వేయనున్నారు. ఈ మేరకు స్థానిక సెబ్ స్టేషన్ ఎస్ఐ డి.ప్రభాకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశించిన డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

కన్వీనర్లు, గృహసారథులే

పార్టీకి వారధులు

- స్పీకర్ తమ్మినేని సీతారాం



పాల్గొన్న గృహసారథులు, వలంటీర్లు

పొందూరు: గ్రామ సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ అధిష్టానం నియమించిన మండల కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని విజయపథంలో నడిపించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. పొందూరులోని జేవీఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పాల్గొని దిశానిర్దేశం చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని పరిశీలించాలన్నారు. 50 ఇళ్లకు నియమించిన గ్రామ వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ పార్టీ తరఫున సీఎం జగనన్న ఆశయాలను, ఆలోచనలను ప్రచారం చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు అందరూ ప్రజలతో మాట్లాడి సంక్షేమ పథకాలపై ఆరా తీయాలన్నారు. పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్ కుమార్, కిల్లి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ బాడాన కృష్ణ, వండాన వెంకటరావు, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, గుడ్ల మోహన్, జేవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

78 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న జానకిరామయ్య

కొత్తూరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి అలయ ఆవరణంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం కురిగాం పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించారు. కొత్తూరు, హిరమండలం, సీతంపేట, భామిని మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన 78 మందికి కంటి పరీక్షలను కొత్తూరు పారామెడికల్ ఆఫ్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య నిర్వహించారు.

శస్త్రచికిత్సలకు 30 మందిని గుర్తించారు. వీరికి శ్రీకాకుళం జనరల్ ఆస్పత్రిలో చికిత్స చేసేందుకు ప్రత్యేక వాహనం ద్వారా తరలించారు. ఆపరేషన్ చేయించుకున్న వారితోపాటు మరో వ్యక్తికి ఉచిత రవాణా, భోజనాన్ని ప్రభుత్వం కల్పించనున్నట్లు జానకిరామయ్య తెలిపారు. అవసరమైన కంటి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్‌లు డాక్టర్ త్రినాథరావు, డాక్టర్ టి.జ్యోతిర్మయి పర్యవేక్షించారు. కార్యక్రమంలో కురిగాం పీహెచ్‌సీ ఈఓ బుజ్జిబాబు, ఏఎన్ఎం మంగమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ఎల్.ఎన్.పేట: సెల్‌ఫోన్ ద్వారా నగదు రహిత లావాదేవీలను నిర్వహించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆంధ్ర ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ సోమయాజులు అన్నారు. సోమవారం లక్ష్మీనర్సుపేట గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులతో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బ్యాంక్ ఖాతాదారులందరూ ఆర్థిక అక్షరాస్యతను కలిగి ఉండాలన్నారు. గ్రామీణ బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు కోసం అవగాహన కల్పించారు. అటల్ పెన్షన్ యోజన, సోషల్ సెక్యూరిటీ స్కీమ్ గురించి ఖాతాదారులకు తెలియజేశారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ పొందిన సాహుకారి లతకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. లక్ష్మీనర్సుపేట బ్రాంచ్ మేనేజర్ సందీప్, ఫీల్డ్ ఆఫీసర్ హేమలక్ష్మి, ఆఫీస్ అసిస్టెంట్ సంధ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



కొండపేట ప్రాంతంలో మొక్కజొన్న పంట

బూర్జ: ఈ ఏడాది రబీలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉంది. మండలంలోని బూర్జ, వావాం, కొరగాం, డొంకలపర్త, కొల్లివలస, కొండపేట తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో వేసిన వరి పంట కోతలు పూర్తయిన తరువాత రబీ సీజన్‌లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది పంట అధికంగా వేశారని ఏఓ వావిలపల్లి రాజేశ్వరరావు తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ ఏడాది క్వింటా బస్తా రూ.6 వేల వరకు ధర పలుకుతుందని రైతులు తెలిపారు. కత్తెర పురుగు అధికంగా చేరుతుందని, తీసుకోవాల్సిన నివారణ చర్యలు గ్రామాల్లో తెలియజేస్తున్నామన్నారు.


కర్బుజా సాగుపై రైతుల ఆసక్తి



సుమంతాపురం ప్రాంతంలో కర్బుజా సాగు

ఎల్.ఎన్.పేట: కర్బుజా సాగు పట్ల రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో పోల్చితే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగిందని ఆయా గ్రామాలకు చెందిన రైతులు చెపుతున్నారు. రబీలో సాగు చేసే వాణిజ్య పంటల్లో లాభాన్ని తెచ్చిపెట్టే కర్బుజా సాగుపై రైతులు ఆసక్తి పెరిగిందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. మండలంలోని సుమంతాపురం, దబ్బపాడు, శ్యామలాపురం, బరటాం, సిద్ధాంతం తదితర గ్రామాల్లో సుమారు 145 ఎకరాల్లో కర్బుజా సాగవుతుందన్నారు. ఖరీఫ్ వరిచేను కోతలు కోసిన తరువాత పంట పొలాన్ని మెత్తగా దుక్కి చేస్తామన్నారు. బాగా కుళ్లిన గత్తం వేసి మారో సారి దుక్కి చేసి పదును ప్రకారం విత్తనాలు వేసుకుంటామని రైతులు చెబుతున్నారు. వారం రోజులకు ఒకసారి పురుగుల మందును పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు.

వ్యర్థాలతో అవస్థలు



రోడ్డు పక్కనే వేస్తున్న వ్యర్థాలు

ఆమదాలవలస రూరల్: మండలంలో మునగవలస గ్రామ శివారులో ఏబీ రోడ్డు పక్కనున్న రొట్టవలస చెరువు గట్టు వద్ద వ్యర్థాలు పడివేయడంతో పరిసర ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. రొట్టవలస గ్రామస్తులు వ్యర్థాలను సంచుల్లో మూట గట్టి పడేస్తున్నారు. చికెన్ వ్యాపారులు దుకాణంలో రోజంతా నిల్వ చేసిన కోళ్ల వ్యర్థాలు తీసుకువచ్చి రహదారి పక్కన వేస్తున్నారు. ఈ వ్యర్థాలు ఎండ, వర్షాలకు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతూ రోగాలకు నిలయంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు అక్కడే ఉన్న కల్యాణ మండపంలో గల వ్యర్థాలను చెరువు గట్టుపై పారవేస్తున్నారు. వాహనదారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి వస్తుందన్నారు. వ్యర్థాలు వేసే వారిపై తగిన చర్యలు తీసుకుని, నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

బాధితులకు అండగా ఉంటాం

ఆమదాలవలస: మండలంలోని మండాది గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధి వేతనదారుల కుటుంబాలకు స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానన్నారు. ప్రభుత్వం నుంచి సహాయాన్ని అందజేస్తామన్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి తాను స్వయంగా సర్పంచ్, ఎంపీటీసీలతో మాట్లాడి సహాయ, సహకారాలు అందించామన్నారు. తన కుమారుడు చిరంజీవినాగ్ వివాహం జరిగి ఆరు నెలలు పూర్తికాలేదన్న కారణంతోనే మృతదేహాల వద్దకు వెళ్లలేకపోయాయని వివరించారు. కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఇటువంటి సున్నితమైన విషయాలను రాజకీయ కోణంలో చూడటం తగదన్నారు. ఇలాంటి విషయాలు మానవతా దృక్పథంతో పరిగణించాలన్నారు.

మురుగు కాలువలు నిర్మించాలి

కొత్తూరు: మండలంలోని నివగాం గ్రామ పీహెచ్ రోడ్డుకు అనుకుని ఉన్న ఎస్సీ వీధి వాసులతోపాటు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని నివగాం ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాడ రాజు సోమవారం తెలిపారు. నివగాం ఎస్సీ వీధి వద్ద ఇటీవల రోడ్డు వేశారు. సిమెంట్ కాలువలు నిర్మించాలని కోరినప్పటికీ.. ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్మాణం చేయలేదన్నారు. కుళాయిలు, వాడుక నీరు రోడ్డుపై ప్రవహిస్తుందన్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో ఇప్పటికే పలుసార్లు ప్రమాదాలు జరిగాయన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని కోరారు.

పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి

పాతపట్నం: మండలంలోని శోభ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన గిరిజన నాయకులు సవర రామారావు, సవర సుక్కు, రామకృష్ణ, రమణ తమకు ప్రత్యేక పంచాయతీ కావాలని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. శోభ పంచాయతీ పరిధిలోని 12 గిరిజన గ్రామాలు ఉన్నాయని, కొమ్మలగూడ, బూర్జగూడ బెన్నగూడ, లక్ష్మగూడతో పాటు పలు గూడలను కలిసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో రమణమూర్తి, లక్ష్మణరావు, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు నోటిఫికేషన్

జలుమూరు: మండల పరిధిలోని తిమడాం (బీసీఈ), సుబ్రహ్మణ్యపురం, ఊడికలపాడు (ఓసీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ వై.లావణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 11వ తేదీలోగా పూర్తిచేసిన దరఖాస్తులు కోటబొమ్మాళి సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

పెద్ద లింగన్న సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ఎంపీపీ గోపి

జలుమూరు: శ్రీముఖలింగం అర్చక సంఘం అధ్యక్షుడిగా తమ్మన్నగారి పెద్ద లింగన్న సేవలు మరువలేనివి అని ఎంపీపీ వాన గోపి అన్నారు. సోమవారం శ్రీముఖలింగంలో సంతాప సభ నిర్వహించారు. దేవాలయ అభివృద్ధితోపాటు అర్చకులు క్రమ శిక్షణకు స్ఫూర్తిదాయకంగా నిలిచేవారన్నారు. సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, ఎంపీటీసీ కరుకోల హరిప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, మండల సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బసవ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

ఆమదాలవలస: కృష్ణాపురం పీఏసీఎస్ పరిధిలో రుణాలు తీసుకున్న రైతులు మార్చి 15లోగా రెన్యువల్ చేసుకుని, ప్రభుత్వం అందించే 4 శాతం వడ్డీని పొందాలని పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సీఈఓ గంగు వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు తేదీలోగా రెన్యువల్ చేయించకపోతే 13 శాతం అపరాధ వడ్డీ వసూలు చేయనున్నట్లు తెలిపారు. రుణాలు పొందిన రైతులంతా ఒరిజినల్ 1–బీ, ఆధార్ జిరాక్స్, రెండు ఫొటోలు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, రెవెన్యూ స్టాంప్‌తో వచ్చి సీకేసీసీ బుక్‌పై సంతకాలు చేసి తమ లోన్‌ను రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నరసన్నపేట: స్థానిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో వ్యవసాయ రుణాలు పొందిన రైతులు సకాలంలో వాయిదాలు చెల్లించి రుణాలు రెన్యువల్ చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు పాగోటి ప్రభాకరరావు, సీఈఓ ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీని కోసం రైతులు ఈకేవైసీ చేసుకున్న పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, తదితర పత్రాలు సొసైటీ కార్యాలయంలో అందజేయాలన్నారు. మార్చిలోగా రుణాలు రెన్యువల్ చేసుకోవాలన్నారు.

స్పందన వినతులు పరిష్కరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి

సారవకోట: సచివాలయ, మండల స్థాయిలో వచ్చిన స్పందన వినతులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి వి జయరాజ్ అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతీ సోమవారం మండల స్థాయిలో స్పందన కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చే వినతులు తీసుకుని వాటిని తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ ప్రవల్లికాప్రియ, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, మండల పరిషత్ ఏఓ ప్రసాదరావు ఉన్నారు.

రీ సర్వేతో మేలు



రైతులకు పాస్ బుక్స్ పంపిణీ చేస్తున్న నాయకులు

నరసన్నపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, బగ్గు రమణయ్య, బొరిగివలస సర్పంచ్ పొన్నాన ప్రసాద్ అన్నారు. బొరిగివలసలో రీ సర్వే పూర్తి కాగా సోమవారం 63 మందికి రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఏళ్ల తరబడి రికార్డుల్లో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. భూములు కలిగిన రైతులకు వారి హక్కుల ప్రకారం పాస్ బుక్స్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. వీఆర్వో సంధ్య మాట్లాడుతూ బొరిగివలస రెవెన్యూ పరిధిలో 1209 ఎకరాలు, 265 సర్వే నంబర్లు, 707 ఖాతాలు ఉన్నాయన్నారు. వీటన్నింటినీ రీ సర్వే చేయడం జరిగిందన్నారు. విడతల వారిగా పాస్ బుక్స్ వస్తున్నాయని వాటిని పంపిణీ చేస్తున్నామన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ యుగంధర్

నరసన్నపేట: మండలంలోని 34 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. సోమవారం నాటికి 2,412 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. రోజురోజుకీ ఉపాధి వేతనదారుల సంఖ్య పెంచుతున్నామని ఏపీడీ యుగంధర్ అన్నారు. మండలంలోని జమ్ము పంచాయతీ శివరాంపురంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో 6.87 లక్షల పని దినాలు లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు 5.24 లక్షల పని దినాలు కల్పించామన్నారు. మార్చి ఆఖరు నాటికి లక్ష్యానికి మించి పనిదినాలు కల్పిస్తామన్నారు. అలాగే వేతనదారులకు వేతనాలు పూర్తి స్థాయిలో వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆకట్టుకున్న భజన



భజన పాటలు ఆలపిస్తున్న బృందం సభ్యులు

నరసన్నపేట: కొల్లవానిపేటలో ఉమారుద్రకోటేశ్వర ఆలయంలో భజనలు స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. ప్రతీ సోమవారం భజనలు చేస్తున్నామని, దీంట్లో భాగంగా సోమవారం సీతారామ భజన బృందం సభ్యులు కొల్ల గోపి, సురవరపు బైరాగినాయుడు ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు. గత ఐదేళ్లుగా ప్రతీ సోమవారం భజనలు చేస్తున్నామన్నారు. ఈ సోమవారంతో 200ల వారాలు భజనలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.


శిథిలావస్థలో కల్వర్టు



కోతకు గురైన కడపలవానిగెడ్డ

ఎల్.ఎన్.పేట: మండలంలోని దబ్బపాడు నుంచి పాతపాడు గ్రామానికి వెళ్లే రోడ్డులో సుమంతాపురం తోట సమీపంలో కడపలవాని గెడ్డపై నిర్మించిన కల్వర్టు కోతకు గురై శిథిలావస్థకు చేరుకుంది. కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురికాకుండా నిర్మించిన రక్షణ గోడ గెడ్డలోకి పడిపోయింది. దీంతో గెడ్డలో వచ్చే వరద నీటి ఉద్ధృతికి రోడ్డు కోతకు గురవుతుంది. మరోవైపు కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాల రాకపోకలకు ఒరధిగా ఉన్న ఈ కల్వర్టు పూర్తిగా శిథిలమైతే రాకపోకలు నిలిచిపోతాయని, అంతకు ముందే ఇక్కడ వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కుప్పలుగా క్యాబేజీ



ట్రాక్టర్లో తరలిస్తున్న క్యాబేజీ పువ్వులు

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామంలో కాలీఫ్లవర్ (క్యాబేజీ పువ్వు) పంట రైతుల చేతికి ఒకేసారి వచ్చింది. వేరేచోట విక్రయించేందుకు ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోవడంతో పెద్ద పువ్వులను కూడా రూ.10 కంటే తక్కువకు విక్రయిస్తున్నామని రైతులు తెలిపారు.